

http://amaravathivelugu.com

RNI No. : APTEL/2022/85169

అమరావతి వెలుగు

సంచలన తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

పాత్రికేయులుగా పని చేయాలన్న ఉత్సాహం
మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన
తెలుగులో రాయగలిగిన భాషా పరిజ్ఞానం ఉన్న
ఔత్సాహికులకు ఇదే మా ఆహ్వానం

అనంతపురం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో
న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను.
విషయ పరిజ్ఞానంతో పాటు సామాజిక,
రాజకీయ అవగాహన కలిగి స్థానికులై ఉండాలి.
వివరాలకు సంప్రదించండి :
జానపాటి వెంకట రమేష్ బాబు ఎడిటర్
9440814576

సంపుటి : 04 సంచిక : 184 ప్రచురణ : శ్రీ సత్యసాయి/అనంతపురం ఎడిటర్ : జానపాటి వెంకట రమేష్ బాబు బుధవారం, నవంబరు 04, 2026 పేజీలు : 4 వెల : ₹2/-

Circulated at Guntur, Palnadu, Bapatla, Chittoor, Tirupati, Madanapalli, Kurnool, Nandyal, Visakapatnam, Vijayawada, Kadikana, Kadapa, Nellore, Rajamendravaram



మరింత అంకిత భావంతో... పనిచేస్తాం..!!

- ఈ గెలుపు కూటమి ప్రభుత్వ పాలనకు ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదం
- మున్సిపల్ ఎన్నికలు ముగిశాయి.. ఇక అందరి దృష్టి ప్రజాసేవపైనే ఉండాలి
- గెలిచిన నేతలంతా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని పిలుపు
- రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- ప్రజలు మనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే అసలైన బాధ్యత : లోకేశ్

అమరావతి: పట్టణ, స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పందించారు. పట్టణ, నగర ప్రజలు ఇచ్చిన ఈ తీర్పును పెద్ద బాధ్యతగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ గెలుపు కూటమి ప్రభుత్వ పాలనకు ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదంగా భావిస్తున్నామన్నారు. మున్సిపల్ ఎన్నికలు ముగిశాయి.. ఇక అందరి దృష్టి ప్రజాసేవపైనే ఉండాలన్నారు. గెలిచిన నేతలంతా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రజలు మనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే అసలైన బాధ్యత అని గెలిచిన నేతలకు పిలుపునిచ్చారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరింత అంకితభావంతో పనిచేస్తామని లోకేశ్ పేర్కొన్నారు.



20 వేల మెగావాట్లు దాటిన విద్యుత్ వినియోగం

2

కూటమి కుమ్మేసింది..!!

పుర పోరులో గెలుపు హోరు

12 కార్పొరేషన్లు, 83 మునిసిపాలిటీలు కూటమికే!

- ఆదోని, నెల్లిమర్లలో జనసేన, టీడీపీ రెబల్స్ గెలుపు
- జనసేన 100 శాతం స్ట్రైక్ రేట్ రిపీట్
- పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ 'గ్లాసు' గలగల
- 3 లక్షల రికార్డు మెజార్టీతో విశాఖ పీఠంపై శ్రావణి
- గుంటూరు మేయర్‌గా లక్ష్మీ అపర్ణ.. లక్షకు పైగా మెజార్టీ
- విజయవాడలో ఆధిక్యంలో వంగవీటి రాధా

'పట్టణం' కూటమికి జైకొట్టింది. అధికార కూటమి అభ్యర్థులకే పట్టం కట్టింది. రెండున్నరేళ్ల కిందట జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితమే 'పుర' ఎన్నికల్లో పునరావృతమైంది. టీడీపీ గెలుపు గాలికి వైసీపీ గల్లంతైపోయింది. చివరికి... వైఎస్ కుటుంబానికి కంచుకోటగా భావించే కడప ఖిల్లాకు సైతం 'కూటమి' బీటలు కొట్టింది. జగన్ సొంత గడ్డ పులివెందుల మునిసిపాలిటీ కూడా టీడీపీ ఖాతాలో పడింది.

అమరావతి : 'పట్టణం' కూటమికి జైకొట్టింది. అధికార కూటమి అభ్యర్థులకే పట్టం కట్టింది. రెండున్నరేళ్ల కిందట జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితమే 'పుర' ఎన్నికల్లో పునరావృతమైంది. టీడీపీ గెలుపు గాలికి వైసీపీ గల్లంతైపోయింది. చివరికి... వైఎస్ కుటుంబానికి కంచుకోటగా భావించే కడప ఖిల్లాకు సైతం 'కూటమి' బీటలు కొట్టింది. జగన్ సొంత గడ్డ పులివెందుల మునిసిపాలిటీ కూడా టీడీపీ ఖాతాలో పడింది. 'వైఎస్' కుటుంబం నుంచి పులివెందుల చేజారడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. పులివెందుల, పుంగనూరు, కుప్పంలో అధికార పార్టీ రిగ్గింగ్ చేసిందన్న జగన్ ఆరోపణలను తిప్పి కొడుతూ... రాష్ట్రమంతా వైసీపీకి వ్యతిరేకంగానే ఓటేసింది. కూటమి నాయకులు ప్రలోభపెట్టారన్న వైసీపీ ఆరోపణల్లో పస లేదని తేల్చేసింది. అటు కార్పొరేషన్లు, ఇటు మునిసిపాలిటీల్లో కూటమి అభ్యర్థులు ఏకపక్ష విజయం నమోదు చేశారు. స్థానిక ఎన్నికల్లో తొలిదశగా ఈనెల 1వ తేదీన నగర పాలక, పురపాలక స్థానాలకు పోలింగ్ జరిగిన సంగతి తెలిసిందే! మంగళవారం ఆయా కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు మొదలైంది. పలు చోట్ల భారీ వర్షాలు, బ్యాలెట్ల లెక్కింపు కావడంతో రాత్రి పొద్దుపోయేదాకా ఫలితాలు వెలువడుతూనే ఉన్నాయి.



..2వ పేజీలో

తుది సమాచారం అందేసరికి... ఎన్నికలు జరిగిన 13 మునిసిపల్ కార్పొరేషన్లలో 12చోట్ల కూటమిదే ఆధిక్యం! బీజేపీ అభ్యర్థి పోటీ చేసిన అనంతపురంలో మాత్రం వైసీపీ అభ్యర్థి ముందంజలో ఉన్నారు. ఇక... ఎన్నికలు జరిగిన 86 మునిసిపాలిటీల్లో 83 పీఠాలపై 'కూటమి' పాగా వేయడం ఖాయమైంది. పలు కార్పొరేషన్లలో కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుపు సాధించారు. మొత్తంగా... అనంతపురం కార్పొరేషన్‌తోపాటు నంద్యాల జిల్లా నందికొట్కూరు, బేతంచర్ల, తిరుపతి జిల్లా నాయుడుపేట మాత్రమే వైసీపీ ఖాతాలో పడ్డాయి.

గెలిపించిన అభివృద్ధి.. సమన్వయం... ప్రభుత్వ పని తీరుతోపాటు కూటమి పార్టీల మధ్య సమన్వయం, అభ్యర్థుల ఎంపికలో 'సోషల్ ఇంజనీరింగ్'... వీటన్నింటి ఫలితమే పురపోరులో ఘనవిజయం!



ఈవీఎం అయినా, బ్యాలెట్ అయినా..

విజయం కూటమిదే

: పవన్ కల్యాణ్

అమరావతి: పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. "నగర పాలక, పుర పాలక, నగర పంచాయతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు దక్కిన అఖండ విజయాలు మా ప్రభుత్వ పాలనకు మద్దతుగా భావిస్తున్నాం. ఇది ఎంతో అమూల్యమైన తీర్పు. మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు విషయంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల పట్ల పట్టణ ప్రజలు విశ్వాసం కనబరుస్తున్నారనడానికి ఈ ఫలితాలే నిదర్శనం. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైన పార్టీ ఈవీఎంలను నిందించింది. ఇప్పుడు బ్యాలెట్ ద్వారా చేపట్టిన స్థానిక ఎన్నికలలోనూ ప్రజలు అదే స్థాయి విజయం కూటమికి ఇచ్చారు. ఈవీఎం అయినా, బ్యాలెట్ అయినా ప్రజలు కూటమి పక్షానే ఉన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీకి దక్కిన బలమైన మద్దతు ఎంతో విలువైనది. ఛైర్మన్, మేయర్ అభ్యర్థులకు దక్కిన విజయాలు, ఆధిక్యతలు పరిశీలిస్తుంటే.. పట్టణ, నగర ప్రజలు జనసేనకి ఇస్తున్న ఆదరణ ఎంతో విలువైనది. వారు పార్టీ పట్ల

..2వ పేజీలో



పులివెందులలో కూటమి... ఘన విజయం..!

- తెదేపా ఛైర్‌పర్సన్ అభ్యర్థి గీతాకుమారి 13,875 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు
- మొత్తం 20 వార్డులకు పోలింగ్ జరగ్గా .. 17 వార్డుల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందారు
- ఏకగ్రీవాలతో కలిపి మొత్తం 37 వార్డుల్లో కూటమి అభ్యర్థులు విజయదుందుభి మోగించారు
- జగన్ సొంత నియోజకవర్గంలో కేవలం మూడు వార్డులతోనే వైకాపా సరిపెట్టుకుంది
- పులివెందులతో పాటు కడప జిల్లా వ్యాప్తంగా తెదేపా సత్తా చాటింది



గుంటూరులో తెదేపా జోరు.. 41వేల ఓట్ల అధిక్యంలో మేయర్ అభ్యర్థి అపర్ణ

గుంటూరు: గుంటూరులో తెదేపా జోరు కొనసాగుతోంది. తెదేపా మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ 41,045వేల పైచిలుకు ఓట్ల ఆధిక్యంలో దూసుకెళ్తున్నారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం 76 డివిజన్లకు గాను అత్యధిక స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. ప్రస్తుతం ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. లక్ష్మీ అపర్ణ విజయం దాదాపు ఖాయమవడంతో తెదేపా శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి.



పులివెందుల: కడప జిల్లా పులివెందుల మున్సిపాలిటీలో కూటమి ఘన విజయం సాధించింది. తెదేపా ఛైర్‌పర్సన్ అభ్యర్థి గీతాకుమారి 13,875 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. మొత్తం 20 వార్డులకు పోలింగ్ జరగ్గా .. 17 వార్డుల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందారు. ఏకగ్రీవాలతో కలిపి మొత్తం 37 వార్డుల్లో కూటమి అభ్యర్థులు విజయదుందుభి మోగించారు. జగన్ సొంత నియోజకవర్గంలో కేవలం మూడు వార్డులతోనే వైకాపా సరిపెట్టుకుంది. పులివెందులతో పాటు కడప జిల్లా వ్యాప్తంగా తెదేపా సత్తా చాటింది. బద్వేలు, జమ్మలమడుగు, కమలాపురం, ప్రొద్దుటూరు, రాజంపేట, యర్రగుంట్ల మున్సిపాలిటీల్లో కూటమి విజయబావుటా ఎగురవేసింది.

ఎన్నికల కంటే ప్రజల ప్రాణాలకే.. తొలి ప్రాధాన్యం..!!

- ఎన్నికల కంటే ప్రజల ప్రాణాలకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుంది
- ప్రజల బాధలను తొలగించగలిగితే ఎన్నికల్లో ఫలితాలు వాటంతట అవే వస్తాయి..
- అభివృద్ధి, సంక్షేమాన్ని సమర్థంగా అమలు చేయడమే ప్రభుత్వ ధ్యేయం
- బుడమేరు విషయంలో ఎలాంటి ప్రమాదం లేదని, వదంతులు నమ్మి ఆందోళన చెందవద్దు
- అర్నబ్, మురసు తుపాన్లతో పాటు ఎల్‌నినో ప్రభావం కూడా రాష్ట్రాన్ని వెంటాడుతోంది
- మూడు సమస్యలు ఒకేసారి ఎదురుకావడం ఇదే తొలిసారి కావచ్చు
- తుపాన్ల ప్రభావంతో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది
- రెస్క్యూ, రిలీఫ్, రిహాబిలిటేషన్ కార్యక్రమాలపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది
- తుపాన్ల కారణంగా 4,095 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

అమరావతి: ఎన్నికల కంటే ప్రజల ప్రాణాలకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మురసు తుపాను పరిస్థితిపై సమీక్ష సందర్భంగా సీఎం మాట్లాడారు. ప్రజల బాధలను తొలగించగలిగితే ఎన్నికల్లో ఫలితాలు వాటంతట అవే వస్తాయని తాను నమ్ముతానని అన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించడంతో పాటు అభివృద్ధి, సంక్షేమాన్ని సమర్థంగా అమలు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను స్వయంగా పరిశీలించేందుకు బుధవారం కూడా క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లనున్నట్టు చెప్పారు. బుడమేరు విషయంలో ఎలాంటి ప్రమాదం లేదని, వదంతులు నమ్మి ఆందోళన చెందవద్దని చంద్రబాబు స్పష్టం చేశారు. అర్నబ్, మురసు తుపాన్లతో పాటు ఎల్‌నినో ప్రభావం కూడా రాష్ట్రాన్ని



..2వ పేజీలో

20 వేల మెగావాట్లు దాటిన విద్యుత్ వినియోగం

హైదరాబాద్ : పునరుత్పాదక విద్యుత్ కొనుగోలుపై తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ)లో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు తమ అభిప్రాయాలను వాడీవేడిగా వినిపించారు. కల్యాణ్ నగర్ టీజీఎస్ కాలనీలో విద్యుత్ నియంత్రణ భవన్ కోర్టు హాల్‌లో టీజీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున, సభ్యులు రఘు కంచర్ల, చెరుకూరి శ్రీనివాసరావు ఈ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. రాష్ట్రంలో కరెంట్ కోతలతో 2014కు ముందు రోజులు కనిపిస్తున్నాయని, విద్యుత్ ఉత్పత్తి, సరఫరాలో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి విమర్శించారు. అక్టోబరులో విద్యుత్ వినియోగం 20 వేల మెగావాట్లకు చేరిందని, రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయనేదానికి ఇదే నిదర్శనమని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. తొమ్మిదినరేళ్లు విద్యుత్ శాఖ మంత్రిగా పనిచేసిన జగదీశ్ రెడ్డి అవాస్తవాలు మాట్లాడి వెళ్లిపోయారన్నారు. భద్రాద్రి, యాదాద్రిలో సబ్ క్రిటికల్ టెక్నాలజీ వాడటం వల్లే నిర్మాణ వ్యయం ఎక్కువైందని బీఆర్ఎస్‌ను విమర్శించారు. బొగ్గు, నీటి వనరులు లభ్యమయ్యే దగ్గర కట్టలేదన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌ను జీ9 బొగ్గు కోసమే కట్టారని, అది విదేశాల్లో మాత్రమే దొరుకుతుందన్నారు.



కూటమి కుమ్మేసింది!

(మొదటిపేజీ తరువాయి) 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇచ్చాయి. దీనికి స్థానిక ఎన్నికల్లో సీట్ల సర్దుబాటులో కూటమి పార్టీల అగ్రనేతల సమన్వయం, సంయమనం తోడయ్యాయి. సీట్ల సర్దుబాటు ఫలించదని, 'కూటమి' విజయానికి రెబల్స్ గండి కొడతారని వచ్చిన అంచనాలు పటాపంచలయ్యాయి. క్షేత్రస్థాయిలోనూ టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య ఓట్ల బదిలీ సవ్యంగా జరిగింది. కర్నూలు జిల్లా ఆదోని మునిసిపాలిటీలో మాత్రమే జనసేన రెబల్ అభ్యర్థి గెలుపొందారు. ఇక్కడ టీడీపీ అభ్యర్థి ఓటమి పాలయ్యారు. బీజేపీకి కేటాయించిన విజయనగరం జిల్లా నెల్లిమర్ల మునిసిపాలిటీలో టీడీపీ రెబల్ అభ్యర్థి విజయం సాధించారు. వెరసి... బీజేపీకి దక్కిన స్థానాల్లో రెండు కూటమి రెబల్స్ సత్తా చాటారు. ఇక... సార్వత్రిక ఎన్నికల్లో వంద శాతం స్ట్రైక్ రేట్ సాధించిన జనసేన... 'పుర పోరు'లోనూ అదే జోరు కనబరిచింది. మేయర్, చైర్మన్ స్థానాల్లో కూటమి తరఫున బరిలోకి దిగిన జనసేన అభ్యర్థులంతా విజయం సాధించారు.

ఎన్నికల కంటే ప్రజల ప్రాణాలకే...

తొలి ప్రాధాన్యం..!!

(మొదటిపేజీ తరువాయి) వెంటాడుతోందని సీఎం తెలిపారు. మూడు సమస్యలు ఒకేసారి ఎదురుకావడం ఇదే తొలిసారి కావచ్చని అభిప్రాయపడ్డారు. తుపాన్ల ప్రభావంతో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటికీ 27 శాతం లోటు వర్షపాతం ఉందని తెలిపారు. రెస్క్యూ, రిలీఫ్, రిహాబిలిటేషన్ కార్యక్రమాలపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించిందని చెప్పారు. తుపాన్ల కారణంగా 4,095 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని, 548 సబ్‌స్టేషన్లలో సరఫరా నిలిచిపోయిందని ముఖ్యమంత్రి వివరించారు.

ఈవీఎం అయినా, బ్యాలెట్ అయినా..

విజయం కూటమిదే: పవన్ కల్యాణ్

(మొదటిపేజీ తరువాయి) కనబరిచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం. జనసేన, తెదేపా, భాజపాకి అండగా నిలిచిన ఓటర్లకు, జనసేన అభ్యర్థుల విజయం కోసం కృషి చేసిన తెదేపా, భాజపా నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ సహకారంతో.. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన అనుభవంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తాం. పురపాలక ఎన్నికల్లో వచ్చిన ఘన విజయాన్ని ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ సాధిస్తామనే విశ్వాసం ఉంది" అని పవన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో కుచ్చుటోపీ

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో సైబర్ నేరగాళ్లు ఇద్దరు వ్యక్తులను రూ.1.38 కోట్ల మేర మోసం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని బాచుపల్లికి చెందిన 68 ఏళ్ల రిటైర్డ్ ఇంజినీర్‌కు ఫేస్‌బుక్ ద్వారా దివ్య అయ్యర్ అనే మహిళ పరిచయమైంది.



హైదరాబాద్ : ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో సైబర్ నేరగాళ్లు ఇద్దరు వ్యక్తులను రూ.1.38 కోట్ల మేర మోసం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని బాచుపల్లికి చెందిన 68 ఏళ్ల రిటైర్డ్ ఇంజినీర్‌కు ఫేస్‌బుక్ ద్వారా దివ్య అయ్యర్ అనే మహిళ పరిచయమైంది. రిటైర్డ్ ఇంజనీర్‌ను ఓ వాట్సాప్ గ్రూపులో చేర్చి 'ఈక్యూఆర్ హెచ్ఎన్ఐ' అనే నకిలీ ట్రేడింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించింది. సంస్థాగత షేర్లు, ఐపీఓల్లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించింది. తొలుత రూ.లక్ష పెట్టుబడికిగాను రూ.72 వేలు వెనక్కి రావటంతో అతడికి నమ్మకం కలిగింది. దీంతో బంధువులు, స్నేహితుల నుంచి అప్పులు తీసుకుని విడతలవారీగా రూ.1.29 కోట్లు బదిలీ చేశాడు.

పులివెందుల గడ్డపై జెండా పాతిన తెదేపా

మున్సిపల్ చైర్‌పర్సన్ సహా 37 వార్డులు కూటమికి

ఘోరంగా మట్టి కరిచిన వైకాపా....ఆ పార్టీకి కేవలం మూడు వార్డులే

అమరావతి : దాదాపు ఐదు దశాబ్దాలుగా అరాచకాలు, అకృత్యాలు, దాడులతో వైఎస్ కుటుంబం అడ్డాగా మార్చుకున్న పులివెందులలో కూటమి చరిత్ర తిరగరాసింది. పులివెందుల పురపాలికపై తెదేపా జెండా పాతింది. వైకాపా అధ్యక్షుడు జగన్ సొంత నియోజకవర్గ కేంద్రమైన పులివెందులలో వైకాపా ఘోర పరాజయం పాలైంది. ఇప్పటివరకు పులివెందులలో ఏ ఎన్నికనైనా అరాచకంతో ఏకపక్షం చేసుకునే వైకాపా.. ఈ ఎన్నికల్లో మూడు వార్డుల్లోనే గెలిచింది. చైర్‌పర్సన్ పోస్టుతో పాటు 37 వార్డుల్ని కూటమి గెలుచుకుంది. పులివెందుల చైర్‌పర్సన్‌గా తెదేపా అభ్యర్థి తూగుట్ల గీతాకుమారి 13,875 ఓట్ల ఆధిక్యంతో వైకాపా అభ్యర్థి, జగన్ చిన్నాన్న మనోహరరెడ్డి భార్య ప్రమీలను మట్టికరిపించారు. మొత్తం 40 వార్డుల్లో 20 వార్డులను ముందే ఏకగ్రీవంగా గెలిచిన కూటమి... ఎన్నికలు జరిగిన 20 వార్డుల్లో 17 (తెదేపా 15, జనసేన 1, భాజపా 1) గెలుచుకుంది. జగన్ తాత వైఎస్ రాజారెడ్డి 1978లో రాజకీయాల్లో ప్రవేశించినప్పటి నుంచి పులివెందులలో ప్రతీ ఎన్నికా ఏకపక్షమే! అయితే ఏకగ్రీవాలు... లేకపోతే రిగ్గింగ్‌తో ఏకపక్ష ఎన్నిక. 2005లో మున్సిపాలిటీ అయ్యాక కూడా వైఎస్ కుటుంబమే ఆధిపత్యం చలాయిస్తూ వచ్చింది. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక అక్కడ ఆరు నెలల క్రితం జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో తెదేపా అభ్యర్థి గెలుపుతో వైఎస్ కుటుంబానికి మొదటి షాక్ తగిలింది. ఇప్పుడు మున్సిపాలిటీపైనా పట్టు కోల్పోయింది.



దీటుగా స్పందించిన కూటమి... వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోను, తర్వాత జగన్ హయాంలోనూ అక్కడ ఏ ఎన్నిక జరిగినా సామాన్యులు ఓట్లు వేయగలిగేవారు కారు. ప్రతిపక్ష పార్టీలు ఏజెంట్లనూ పెట్టలేని భయానక వాతావరణం ఉండేది. ఇప్పుడు కూటమికి అవకాశం వచ్చింది. దీటుగా స్పందిస్తూ దెబ్బకొట్టింది. అధికారం దన్నుతో ప్రతివ్యూహాలు పన్నింది. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఈ ఎన్నికల్లోనూ నామినేషన్ల ఘట్టం నుంచీ మండీమార్బలాన్ని వెంటేసుకుని అరాచకానికి ప్రయత్నించినా... కూటమి ధాటికి వాళ్ల ఆటలు సాగలేదు. చొక్కాచేతులు మడత పెడతానని, ఎవరొస్తారో చూస్తానని జగన్ పులివెందుల గడ్డపై నుంచి సవాల్ చేసినా... కూటమి నాయకులు ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. చివరకు పోలింగ్ రోజున జగన్ తమ పార్టీ ఏజెంట్లను బయటకు తీసుకొచ్చి... రోడ్డుపై కూర్చుని ధర్నా చేయాల్సిన పరిస్థితి కల్పించింది. మంగళవారం ఓట్ల లెక్కింపు సందర్భంగా ఆ పార్టీ ఏజెంట్లే లేరు. వైకాపా అభ్యర్థి ప్రమీల కూడా పోలింగ్ కేంద్రానికి వెళ్లలేదు. పులివెందులలో వైఎస్ కుటుంబం రాజకీయంగా ఇంత నిస్సహాయ స్థితిలోకి వెళ్లడం ఇదే మొదటిసారి. పులివెందుల చైర్‌పర్సన్‌గా విజయం సాధించిన తూగుట్ల గీతాకుమారి, కౌన్సిలర్‌గా గెలుపొందిన ఆమె భర్త మధుసూదన్‌రెడ్డిలను సన్మానిస్తున్న కూటమి కార్యకర్తలు వ్యూహాత్మకంగా వ్యవహరించి ఘనవిజయం పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థి ఎంపిక నుంచి కూటమి వ్యూహాత్మకంగా వ్యవహరించింది. జనరల్ మహిళకు కేటాయించిన ఈ స్థానంలో వైఎస్ కుటుంబం నుంచి జగన్ చిన్నాన్న మనోహరరెడ్డి భార్య ప్రమీల పోటీచేశారు. ఆమె మాజీ చైర్‌పర్సన్ కూడా. ఆమెపై పోటీకి 2014లో స్థానికసంస్థల ఎన్నికల్లో వైఎస్ కుటుంబానికి వ్యతిరేకంగా వివేకానందరెడ్డి మద్దతుతో కౌన్సిలర్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలిచిన తూగుట్ల కుటుంబానికి చెందిన మధుసూదన్‌రెడ్డి భార్య గీతాకుమారిని బరిలో దించింది. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి (భాజపా) సమన్వయంతో పనిచేశారు. మొత్తం 40 వార్డులకు గాను 20 చోట్ల కూటమికి ఏకగ్రీవం కావడంతో... వైకాపా ఆత్మరక్షణ ధోరణిలోకి పోయింది. వైఎస్ కుటుంబానికి గట్టి పట్టున్న ప్రాంతాల్లోనూ ఆ పార్టీ నుంచి తెదేపాలోకి పెద్ద ఎత్తున వలసలు జరిగాయి. దాంతో ఇదివరకు కనీస ప్రాతినిధ్యం లేని వార్డుల్లోనూ తెదేపా పుంజుకుంది. పోలింగ్ రోజు వెయ్యిమంది పోలీసులతో భద్రత కల్పించడం, భరోసా ఇవ్వడంతో చాన్నాళ్ల తర్వాత ప్రజలు పెద్దసంఖ్యలో బయటకు వచ్చి స్వేచ్ఛగా ఓట్లు వేశారు. 2019-24 మధ్య వైకాపా హయాంలో చేసిన అరాచకాలతో ప్రజలు విసిగి వేసారిపోయారు. జమ్మలమడుగు చైర్‌పర్సన్‌గా జ్యోతి (తెదేపా జిల్లా అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి భార్య) 20,237 ఓట్ల మెజారిటీతో గెలిచారు. మొత్తం 32 వార్డులనూ కూటమి కైవసం చేసుకుంది. వైకాపాకు ఒక్కటీ దక్కలేదు. వైకాపా చైర్‌పర్సన్ అభ్యర్థి హైమావతి డిపాజిట్ కోల్పోయారు. మాచర్ల పురపాలక సంఘ ఎన్నికల్లో వైకాపా తరఫున షేక్ సుల్తానా నామినేషన్ వేసినా సకాలంలో బి.ఫారం సమర్పించలేదు. ఆ పార్టీ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆమెకు డిపాజిట్ దక్కలేదు.



సంపాదకీయం

ఓటరు విజ్ఞత.. కూటమే విజేత

'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్'ను కోరుకున్న విశాఖ ఓటర్లు

మేయర్ పీఠమెక్కనున్న శ్రావణి

అత్యధిక వార్డుల్లో సత్తాచాటిన తెదేపా, జనసేన, భాజపా

ఎన్నికల్లోనూ చతికిలబడిన వైకాపా

విశాఖపట్నం : 'కూటమి' మళ్లీ విజయధ్వంకా మోగించింది జీవీఎంసీ ఎన్నికల్లో తిరుగులేని ఆధిక్యత చాటింది దశాబ్దాలుగా తెదేపా జెండాను మోసిన మధ్యతరగతి



కుటుంబానికి చెందిన ముక్కా శ్రావణి భారీ మెజార్టీతో మేయర్‌గా ఎన్నికయ్యారు! కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారుతో రాష్ట్రంలో





అభివృద్ధి పరుగులు పెడుతోంది! అదే రీతిలో విశాఖ నగరంలోనూ 'కూటమి'తోనే పురోగతి సాధ్యమని నమ్మిన ఓటర్లు సాధారణ ఎన్నికల్లో ఆశీర్వదించినట్లే... 'గ్రేటర్'లోనూ విజయతిలకం దిద్దారు మొత్తంగా 120 వార్డుల్లో పోటీ చేసిన కూటమి అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో జయకేతనం ఎగురవేశారు మంగళవారం ఉదయం ఓట్ల లెక్కింపు మొదలైన కొద్ది సమయానికే పరిస్థితి అర్థమై... వైకాపా అభ్యర్థులు లెక్కింపు కేంద్రాల నుంచి వెనుతిరిగారు ఆ పార్టీకి నగరంలో మరోసారి కోలుకోలేని దెబ్బతగిలింది! పలువురు 'రెబల్స్' ప్రధాన పార్టీల విజయావకాశాలకు గండికొట్టారు.. తమ సత్తా చాటి గెలుపును సొంతం చేసుకున్నారు. ఈ మరపురాని గెలుపుతో కూటమి శ్రేణుల్లో సంబరాలు మిన్నంటాయి.

విశాఖలో కూటమి శ్రేణుల కోలాహలం... ఆ అనుమానాలు పటాపంచలు చేస్తూ..: ఆదివారం పోలింగ్ తరువాత 'క్రాస్' ఓటింగ్ జరిగిందనే ప్రచారం సాగింది. ఇది కూటమికే నష్టమనేలా రకరకాల అనుమానాలు, భిన్న విశ్లేషణలు వచ్చాయి. వాటన్నింటినీ పటాపంచలు చేస్తూ.. కూటమికి నగర ఓటర్లు సుస్పష్టమైన తీర్పునిచ్చారు. ఓట్ల లెక్కింపు ఆరంభమైనప్పటి నుంచి ప్రతిపక్ష వైకాపా అభ్యర్థులు ఏ దశలోను సత్తా చాటలేకపోయారు. అత్యధిక వార్డులు కూటమి పార్టీల పరం అయ్యాయి. కూటమి మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణికి దాదాపు ప్రతి వార్డుల్లో మెజార్టీ వచ్చింది. మధ్యాహ్నం నుంచే వైకాపా అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రాల నుంచి వెళ్లిపోయారు. మహా విశాఖ నగర పాలక సంస్థ మేయర్ పీఠం నాలుగు దశాబ్దాల తరువాత తెదేపా అభ్యర్థికి దక్కింది. అసెంబ్లీ ఎన్నికల్లో తెదేపా అభ్యర్థులు ఎప్పటికప్పుడు సత్తా చాటుతున్నా.. జీవీఎంసీ పీఠం కైవసం చేసుకోవడంలో వైఫల్యాలు తెదేపాను వెంటాడుతూ వచ్చాయి. ఈసారి కూటమిగా సత్తా చాటి మేయరు స్థానం కైవసం చేసుకుంది. ప్రస్తుత జీవీఎంసీ.. 1980లో 50 వార్డులతో కార్పొరేషన్‌గా ఏర్పడింది. అప్పట్లో తొలి మేయరు భాజపాకు చెందిన ఎన్ఎస్ఎన్ రెడ్డి పనిచేశారు. 1987 ఏప్రిల్‌లో మేయరు స్థానానికి ప్రత్యక్ష ఎన్నికలను నాటి తెదేపా ప్రభుత్వం నిర్వహించింది. తెదేపా తరఫున పోటీ చేసిన ప్రముఖ న్యాయవాది, దివంగత డీవీ సుబ్బారావు ఘన విజయం సాధించారు. మళ్లీ 40 ఏళ్ల తర్వాత ఇప్పుడు జీవీఎంసీ పీఠాన్ని తెదేపా కైవసం చేసుకుంది. 1987 తర్వాత నాలుగుసార్లు జీవీఎంసీకి ఎన్నికలు జరిగాయి. రెండు సార్లు మేయరు స్థానానికి ప్రత్యక్షంగా, మరో రెండు సార్లు పరోక్ష పద్ధతిలో నిర్వహించారు. ఆయా ఎన్నికల్లో తెదేపా ఓడిపోయింది. మూడు సార్లు వరుసగా కాంగ్రెస్, ఒకసారి వైకాపా మేయరు పీఠం కైవసం చేసుకున్నాయి. 2024లో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైకాపాకు చెందిన పలువురు కార్పొరేటర్లు తెదేపాలో చేరడంతో మేయరు పదవి దక్కినప్పటికీ నేరుగా ఎన్నికల్లో తలబడి విజయం సాధించడం 1987 తర్వాత మళ్లీ ఇప్పుడే.

ఏసీబీ వలలో మెప్మా అధికారి..

రూ.4.75 కోట్ల ఆస్తుల గుర్తింపు

బహిరంగ మార్కెట్‌లో రూ.25 కోట్లపైనే ఉంటుందని అంచనా

హైదరాబాద్ : ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో మరో ఉన్నతాధికారి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి చిక్కారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అదనపు డైరెక్టర్ నల్లగుంట్ల యాదగిరిరావు ఇళ్లపై ఏసీబీ బృందాలు మంగళవారం ఉదయం ఏకకాలంలో 10 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఏసీబీ రంగారెడ్డి రేంజ్ డీఎస్పీ ఆనంద్‌కుమార్ నేతృత్వంలోని బృందాలు సోదాల్లో నిమగ్నయ్యాయి. ఈ క్రమంలో హైదరాబాద్ ఉప్పల్ హైకోర్టు కాలనీలోని యాదగిరిరావు ఇంటితోపాటు సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సన్నిహితులు, బంధువులు, బినామీల ఇళ్లు, కార్యాలయాల్లో చేపట్టిన తనిఖీల్లో భారీగా స్థిర, చరాస్తుల్ని గుర్తించారు. బ్యాంకు లాకర్లనూ తనిఖీ చేసి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ స్వాధీనం చేసుకున్న స్థిర, చరాస్తుల విలువ రూ.4.75 కోట్లుగా లెక్కగట్టారు. స్థిరాస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.25 కోట్ల మేర ఉంటుందని అంచనా వేస్తున్నారు.



ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

2007లో గ్రేడ్-2 మున్సిపల్ కమిషనర్‌గా..

యాదగిరిరావుకు మున్సిపల్‌శాఖలో సుదీర్ఘ అనుభవముంది. ఆయన 2007లో గ్రూప్-1 పరీక్ష రాసి గ్రేడ్-2 మున్సిపల్ కమిషనర్‌గా శాఖలో అడుగు పెట్టారు. దాదాపు రెండు దశాబ్దాలపాటు వివిధ హోదాల్లో పనిచేశారు. ఎక్కువకాలం జీహెచ్ఎంసీలో డిప్యూటీ, జోనల్ కమిషనర్‌గా పనిచేశారు. కరీంనగర్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో పలు ఆరోపణలు రావడంతో ప్రభుత్వం ఆయన్ని బదిలీ చేసింది. దాదాపు గత ఏడాదికాలంగా మెప్మాలో ఉన్నత హోదాలో విధులు నిర్వర్తిస్తున్నారు. మెప్మా నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ నిర్వహించింది. రూ.40 కోట్ల మేర సొమ్ము పక్కదారి పట్టిందని గుర్తించినట్లు సమాచారం. ఇప్పుడు అదే విభాగం ఉన్నతాధికారి ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశంగా మారింది. యాదగిరిరావును ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపర్చనున్నట్టు డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపారు. ఆస్తులకు సంబంధించిన మరింత సమాచారం కోసం విచారణ కొనసాగిస్తామని చెప్పారు.

మున్సిపాలిటీలో టీడీపీ హవా..!

48 వార్డుల కౌన్సిలర్ స్థానాల ఫలితాలు వెల్లడి

పలు వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థుల విజయకేతనం

25వ వార్డులో టీడీపీ అభ్యర్థి రామ్ తేజ్ గౌడ్ ఏకగ్రీవం

- 36వ వార్డులో సిరిన్ ఫర్హాద్ విజయం

గుంతకల్లు, నవంబరు 3, అమరావతి వెలుగు : మున్సిపల్ ఎన్నికల కౌన్సిలర్ స్థానాల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో వార్డుల వారీగా ఫలితాలు వెలువడ్డాయి. మొత్తం 48 వార్డులకు సంబంధించి అభ్యర్థుల గెలుపోటములు స్పష్టమయ్యాయి. పలు వార్డుల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు విజయం సాధించగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, స్వతంత్ర అభ్యర్థులు కూడా తమ ప్రాతినిధ్యాన్ని చాటుకున్నారు. సీపీఐ, బీజేపీ అభ్యర్థులు సైతం విజయం సాధించారు.మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని కసాపురం రోడ్డులోని సర్వేపల్లి రాధాకృష్ణన్ పురపాలక ఉన్నత పాఠశాల కౌంటింగ్ కేంద్రంలో నిర్వహించారు. ఉదయం నుంచి కొనసాగిన కౌంటింగ్ ప్రక్రియలో అధికారులు వార్డుల వారీగా ఫలితాలను వెల్లడించారు. ఫలితాల కోసం అభ్యర్థులు, ఏజెంట్లు, రాజకీయ పార్టీల నాయకులు ఆసక్తిగా ఎదురుచూశారు.

48 వార్డుల విజేతల వివరాలు ఇలా ఉన్నాయి:

1వ వార్డు – ప్రభాకర్ (టీడీపీ) – 570 ఓట్లు,
2వ వార్డు – రమాదేవి (సీపీఐ) – 137 ఓట్లు,
3వ వార్డు – గుండా జ్యోతి (వైసీపీ) – 67 ఓట్లు,
4వ వార్డు – మాండ్ల మహాలక్ష్మి (బీజేపీ) – 14 ఓట్లు,
5వ వార్డు – రామాంజనమ్మ (టీడీపీ) – 461 ఓట్లు,
6వ వార్డు – స్టోర్ రమేష్ (టీడీపీ),
7వ వార్డు – సాంబశివ (వైసీపీ) – 613 ఓట్లు,
8వ వార్డు – మహదేవ్ (వైసీపీ),
9వ వార్డు – అరుణ (వైసీపీ),
10వ వార్డు – గాజుల సంధ్య (స్వతంత్ర) – 58 ఓట్లు,
11వ వార్డు – హరినాథ్ (స్వతంత్ర) – 121 ఓట్లు,
12వ వార్డు – గాజుల వెంకటేష్ (టీడీపీ) – 209 ఓట్లు,
13వ వార్డు – రంగమ్మ (వైసీపీ) – 262 ఓట్లు,
14వ వార్డు – మస్తాన్ (వైసీపీ) – 152 ఓట్లు,
15వ వార్డు – కోడెల జీవిత (టీడీపీ) – 391 ఓట్లు,
16వ వార్డు – రమేష్ గౌడ్ – 248 ఓట్లు,
17వ వార్డు – బి. విజయలక్ష్మి (టీడీపీ) – 319 ఓట్లు,
18వ వార్డు – యూనస్ (స్వతంత్ర) – 140 ఓట్లు,
19వ వార్డు – అంజినేయులు (టీడీపీ) – 47 ఓట్లు,
20వ వార్డు – నాగరత్న (టీడీపీ) – 627 ఓట్లు,
21వ వార్డు – లక్ష్మి (స్వతంత్ర),
22వ వార్డు – సాయి (టీడీపీ),
23వ వార్డు – పార్వతి (టీడీపీ),
24వ వార్డు – అంజలి (టీడీపీ) – 381 ఓట్లు,
25వ వార్డు – రామ్ తేజ్ గౌడ్ (టీడీపీ) – ఏకగ్రీవం,
26వ వార్డు – కృపాకర్ (టీడీపీ) – 75 ఓట్లు,
27వ వార్డు – నూర్ (వైసీపీ),
28వ వార్డు – జమీలా బీ (వైసీపీ) – 80 ఓట్లు,
29వ వార్డు – చిట్టెమ్మ (టీడీపీ) – 408 ఓట్లు,
30వ వార్డు – హనుమంతు (టీడీపీ) – 246 ఓట్లు,
31వ వార్డు – నందీశ్వర (టీడీపీ) – 877 ఓట్లు,
32వ వార్డు – సుజాత (టీడీపీ) – 751 ఓట్లు,
33వ వార్డు – బట్నపాడు లక్ష్మి – 109 ఓట్లు,
34వ వార్డు – రేష్మ (వైసీపీ) – 176 ఓట్లు,
35వ వార్డు – బి. మానెమ్మ (వైసీపీ) – 531 ఓట్లు,
36వ వార్డు – సిరిన్ ఫర్హాద్ (స్వతంత్ర) – 102 ఓట్లు
37వ వార్డు – రమిజా బేగం (వైసీపీ),
38వ వార్డు – సహానాజ్ (వైసీపీ),
39వ వార్డు – పవన్ కుమార్ (వైసీపీ),
40వ వార్డు – ప్రభాకర్ (టీడీపీ) – 440 ఓట్లు,
41వ వార్డు – కృష్ణమూర్తి (స్వతంత్ర),
42వ వార్డు – కె.ఎల్. సీనా (టీడీపీ) – 507 ఓట్లు,
43వ వార్డు – శరణ్య (స్వతంత్ర),
44వ వార్డు – ఎం.ఎం. రహిమాన్ (వైసీపీ) – 448 ఓట్లు,
45వ వార్డు – రిజ్వాన (టీడీపీ) – 121 ఓట్లు,
46వ వార్డు – రామాంజనేయులు (టీడీపీ) – 123 ఓట్లు,
47వ వార్డు – నాగభూషణ (టీడీపీ),
48వ వార్డు – జీవిత (టీడీపీ) – 47 ఓట్లు





మున్సిపల్ ఎన్నికల కౌన్సిలర్ స్థానాల ఫలితాలు వెలువడటంతో విజయం సాధించిన అభ్యర్థులు, వారి అనుచరులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. ముఖ్యంగా 25వ వార్డులో రామ్ తేజ్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికవడం, 36వ వార్డులో స్వతంత్ర అభ్యర్థి సిరిన్ ఫర్హాద్ విజయం సాధించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.కాగా, చైర్‌పర్సన్ అభ్యర్థులకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఇంకా రెండు రౌండ్లు మిగిలి ఉండటంతో ఆ ఫలితాల కోసం రాజకీయ వర్గాలు ఎదురుచూస్తున్నాయి.

గెలుపే లక్ష్యంగా శ్రీధర్ విస్తృత ప్రచారం

మహిళలు, యువత పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొని మద్దతు

కోనసీమ/ఆత్రేయపురం, నవంబరు 03, అమరావతి వెలుగు : మండలంలో జడ్పీటీసీ ఎన్నికల ప్రచారానికి గడువు ముగిసే సమయానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీ అభ్యర్థి



కప్పల శ్రీధర్‌కు మద్దతుగా మహిళలు, యువకులు భారీ ఎత్తున ప్రచారం నిర్వహించారు. పేరవరం, మెర్లపాలెం, వద్దిపర్రు తదితర గ్రామాల్లో శ్రీధర్ అనుచరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలు నిర్వహిస్తూ ఇంటింటి ప్రచారం చేపట్టారు.ఈ సందర్భంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. నమ్మకానికి, మోసానికి మధ్య జరుగుతున్న ఎన్నికలుగా అభివర్ణిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి కప్పల శ్రీధర్‌తో పాటు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో కనుమూరు శ్రీనివాసరాజు రాయి వెంకటేశ్వరరావు బెజవాడ సతీష్ గోగుల్ కిషోర్ బోనం సాయిబాబు ఎంపిటిసి అభ్యర్థి నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

రొద్దంలో మంత్రి సవిత రోడ్‌షో..

కూటమి అభ్యర్థుల గెలుపునకు ప్రచారం

రొద్దం , నవంబరు 03, అమరావతి వెలుగు : పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం చివరి రోజు మంత్రి సవిత విస్తృతంగా రోడ్‌షో నిర్వహించారు. కూటమి బలపరిచిన జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులకు మద్దతుగా చేపట్టిన ఈ రోడ్‌షోలో ఆమె పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రచారం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని పలు ప్రాంతాల మీదుగా సాగిన రోడ్‌షోకు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎన్నికల ప్రచారానికి చివరి రోజు కావడంతో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని అభ్యర్థుల విజయానికి మద్దతుగా నినాదాలు చేశారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని మంత్రి సవిత ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, వివిధ పార్టీల శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కౌంటింగ్ కేంద్రంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ





పుట్టపర్తి, నవంబరు 3, అమరావతి వెలుగు :

పుట్టపర్తి మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ, భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పట్టణంలోని చిన్నంపల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ చేపట్టిన భద్రతా చర్యలు, పోలీసు బందోబస్తు, ఇతర ఏర్పాట్లను సమీక్షించారు. కౌంటింగ్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగుతున్న తీరుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు పోలీసు అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా, పారదర్శకంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎస్పీ వెంట పుట్టపర్తి డీఎస్పీ మాణిక్యరావు, సీఐ యువరాజు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఆర్జే రత్నాకర్ ఆశీస్సులు తీసుకున్న...

నూతన చైర్మన్ మేకల ఈశ్వర్

పుట్టపర్తి , నవంబరు 03, అమరావతి వెలుగు : పుట్టపర్తి మున్సిపాలిటీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన బోయ మేకల ఈశ్వర్ ఘన విజయం సాధించిన నేపథ్యంలో శ్రీ



సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం రత్నాకర్ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా పుట్టపర్తి మున్సిపాలిటీ అభివృద్ధి, పట్టణ భవిష్యత్ కార్యాచరణ, ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై ఆత్మీయంగా చర్చించారు. ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన పుట్టపర్తి పట్టణాన్ని మరింత అభివృద్ధి చేయడం, సుందరీకరించడం, పట్టణ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో లభించిన విజయాన్ని బాధ్యతగా భావిస్తూ పుట్టపర్తి పట్టణ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని ఈ సందర్భంగా మేకల ఈశ్వర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తొట్ల గంగాధర్, పుట్టపర్తి మార్కెట్ యార్డు చైర్మన్ పూల శివప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

లేపాక్షిలో టీడీపీ ఇంటింటా ప్రచారం..

అభ్యర్థుల విజయానికి నేతల విస్తృత పర్యటన

మండల అభివృద్ధి, కూటమి ప్రభుత్వానికి మరింత బలం చేకూర్చేందుకు టీడీపీ అభ్యర్థులను గెలిపించాలి - నాయకుల పిలుపు

హిందూపురం, నవంబరు 3, అమరావతి వెలుగు : లేపాక్షి మండలంలో తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. మంగళవారం మండల కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో టీడీపీ నాయ కులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పసుపు జెండాలు చేతబట్టి పుర వీధుల్లో పర్యటిస్తూ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా లేపాక్షి మండల జడ్పీటీసీ అభ్యర్థి చంద్రకళ ఆనంద్ కుమార్‌తో పాటు ఎంపీటీసీ అభ్యర్థులు జ్యోతి, దిష్ మంజు, గంగరత్నమ్మ, రవికుమార్, పుష్పలతల విజయమే లక్ష్యంగా టీడీపీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేపట్టాయి. ప్రతి ఇంటికీ వెళ్లి అభ్యర్థులను పరిచయం చేస్తూ ఓటర్ల మద్దతు కోరారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లేపాక్షి మండల సమగ్ర అభివృద్ధి కోసం టీడీపీ అభ్యర్థులకు ప్రజలు తమ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వానికి మరింత బలాన్ని చేకూర్చేందుకు పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ అభిలాష్, ఆంధ్రప్రదేశ్ టూరిజం డైరెక్టర్ జయప్ప, జిల్లా అధికార ప్రతినిధి ఎం. ఆనంద్ కుమార్, మాజీ ఎంపీపీ సూర్యప్రకాష్, లేపాక్షి టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు గోవింద్, నాయకులు నరసింహమూర్తి, నిజాముద్దీన్, సుబ్బప్ప, బుల్లెట్ రవి, హోటల్ బసప్ప, డిస్కో సీనప్ప తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



21వ వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా...

: కౌన్సిలర్ ఇడగొట్టు ఉమాదేవి

పుట్టపర్తి: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డు గణేష్ సర్కిల్‌లో తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేసిన ఇడగొట్టు ఉమాదేవి 94 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కానా భారతి, స్వతంత్ర అభ్యర్థి కానా సుకన్యలపై ఆమె విజయం సాధించి కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఇడగొట్టు ఉమాదేవి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి, పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రివర్యులు డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన విజయానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వార్డు ప్రజలు, మహిళలు, యువతకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు 21వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మార్గదర్శకత్వంలో, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సహకారంతో, మున్సిపల్ చైర్మన్ మేకల ఈశ్వర్ తోడ్పాటుతో వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా వార్డులో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ అత్యవసర సమయాల్లో నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటానన్నారు. విద్యుత్ సదుపాయాల మెరుగుదల, అంతర్గత రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. వార్డులో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చొరవ చూపుతానన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా వార్డులోని ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తానని, ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు. తన విజయాన్ని వ్యక్తిగత విజయంగా కాకుండా 21వ వార్డు ప్రజల విజయంగా భావిస్తున్నానని, తన గెలుపు కోసం అహర్నిశలు శ్రమించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రతి ఓటరుకు మరోసారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.



మహిళల ఆర్థిక స్వావలంబనకు...

కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

పరిగి, నవంబరు 03, అమరావతి వెలుగు : మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన, ఉపాధి అవకాశాల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవితమ్మ తెలిపారు. పెనుకొండ నియోజకవర్గంలోని పరిగి మండల కేంద్రంలో ఉన్న టెక్‌పోర్ట్ ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ (నిషా డిజైన్స్), ఇండియన్ వన్ డిజైన్స్ ఎక్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ గార్మెంట్స్ పరిశ్రమలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులతో మంత్రి ముఖాముఖి నిర్వహించారు. వారి యోగక్షేమాలు, పని పరిస్థితులు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళలకు ఉపాధి కల్పించడం ద్వారా వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో పాటు స్వావలంబన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మహిళల సంక్షేమం, విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. మహిళల జీవితాల్లో మరింత వెలుగులు నింపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పరిశ్రమల్లో పనిచేసే మహిళలకు మెరుగైన పని వాతావరణం, అవసరమైన సదుపాయాలు కల్పించాల్సిన ప్రాధాన్యాన్ని వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని మంత్రి సవితమ్మ కోరారు. కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి అభివృద్ధికి సహకరించాలని మహిళా ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు.



జడ్పీటీసీగా కొమ్మెర రమణమ్మను...

అత్యధిక మెజారిటీతో గెలిపించండి

కూటమి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ఇంటింటా ఎన్నికల ప్రచారం

తలుపుల, నవంబరు 03, అమరావతి వెలుగు : తలుపుల మండల జడ్పీటీసీ కూటమి జనసేన అభ్యర్థిని కొమ్మెర రమణమ్మ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మండలంలోని లక్ష్మీ సముద్రం, ఓవరెడ్డిపల్లి, ఓదెల పల్లి గ్రామాల్లో ఆయా ఎంపీటీసీ అభ్యర్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి విస్తృతంగా పర్యటించి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ గ్లాస్ గుర్తుకు ఓటు వేసి తనను జడ్పీటీసీగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కొమ్మెర రమణమ్మ ఓటర్లను అభ్యర్థించారు. గ్రామాల్లో ప్రజలను నేరుగా కలుసుకుంటూ కూటమి ప్రభుత్వ పాలనలో చేపడుతున్న అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. జడ్పీటీసీ ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా తనకు గ్లాస్ గుర్తుపై, కూటమి తరపున పోటీ చేస్తున్న తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కొమ్మెర రమణమ్మ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందన్నారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తానని తెలిపారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సహకారం, కూటమి నాయకుల మార్గదర్శకత్వంతో తలుపుల మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని జడ్పీటీసీగా తనను, ఎంపీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గ్రామాల అభివృద్ధికి సమష్టిగా పనిచేసే అవకాశం కల్పించాలని, గ్లాస్ గుర్తుకు, సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి కూటమి అభ్యర్థులకు అఖండ విజయాన్ని అందించాలని కొమ్మెర రమణమ్మ ఎన్నికల ప్రచారంలో ప్రజలను అభ్యర్థించారు.





ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించండి

చెన్నైకొత్తపల్లి, నవంబరు 03, అమరావతి వెలుగు : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చెన్నైకొత్తపల్లి ఎంపీటీసీ-1 స్థానం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎస్టిడి శ్రీనివాసరెడ్డి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను నేరుగా కలుసుకుని తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. ఎంపీటీసీ అభ్యర్థిగా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ ప్రజల ఆదరాభిమానాలతో ఎంపీటీసీగా ఎన్నికైతే ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. గ్రామంలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. అదేవిధంగా మండల జడ్పీటీసీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని హేమలతకు కూడా ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.



నవంబరు 5న జిల్లాలో

బ్యాంకులకు సెలవు

పుట్టపర్తి, నవంబరు 03, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో నవంబరు 5న జిల్లాలోని అన్ని బ్యాంకులకు సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏ. శ్యామ్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026 సంవత్సరానికి సంబంధించి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ రోజున జిల్లాలోని అన్ని బ్యాంకులకు సెలవు వర్తిస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.



పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్‌గా కూటమి అభ్యర్థి

మేకల ఈశ్వర్ ఘన విజయం

1577 ఓట్ల మెజారిటీతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వనం అవినాష్‌పై గెలుపు

పట్టణాభివృద్ధి, సుందరీకరణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తా: నూతన చైర్మన్ మేకల ఈశ్వర్

పుట్టపర్తి, నవంబరు 3, అమరావతి వెలుగు : పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో కూటమి అభ్యర్థి, జనసేన పార్టీ నాయకుడు మేకల ఈశ్వర్ ఘన విజయం సాధించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వనం అవినాష్‌పై 1,577 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ విజయంతో పుట్టపర్తి మున్సిపాలిటీ పీఠాన్ని కూటమి కైవసం చేసుకుంది. తన విజయానికి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అందించిన సహకారం, కూటమి నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి ఎంతో దోహదపడిందని నూతన చైర్మన్ మేకల ఈశ్వర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి చైర్మన్ అభ్యర్థిగా అవకాశం కల్పించిన జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. తన విజయానికి వెన్నంటి నిలిచి, అన్ని విధాలుగా సహకరించి, విజయబావుటా ఎగురవేయడంలో కీలకంగా వ్యవహరించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి, పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తనకు అందించిన సహకారం మరువలేనిదన్నారు. పార్టీ శ్రేణుల సమష్టి కృషి, పట్టణ ప్రజల ఆదరాభిమానాలు తన విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. తన గెలుపు కోసం కష్టపడిన కూటమి నాయకులు, కార్యకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులు, ఓటు వేసి ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. పుట్టపర్తి పట్టణ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సహకారం, కూటమి పెద్దల మార్గదర్శకత్వంతో పుట్టపర్తి పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానన్నారు. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందిన పుట్టపర్తి పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలిపారు. పట్టణంలో తాగునీటి సరఫరా, రహదారులు, విద్యుత్, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు అవసరమైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటానని, వార్డులవారీగా సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. పుట్టపర్తికి దేశవిదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా పట్టణ సుందరీకరణకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతానన్నారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే తన ప్రధాన బాధ్యతగా భావిస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని, ప్రజాప్రతినిధిగా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానని తెలిపారు. తనపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మార్గదర్శకత్వంలో, కూటమి నాయకుల సహకారంతో పుట్టపర్తి పట్టణ సమగ్ర అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని నూతన మున్సిపల్ చైర్మన్ మేకల ఈశ్వర్ వెల్లడించారు.



క్షేత్రస్థాయిలో కరువు తీవ్రతను...

పరిశీలించిన కేంద్ర బృందం

పుట్టపర్తి, నవంబరు 3, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లాలో వర్షాభావ పరిస్థితులు, కరువు కారణంగా పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం నియమించిన అంతర్ మంత్రిత్వ శాఖల కేంద్ర కరువు అంచనా బృందం (ఐఎంసీటీ) మంగళవారం జిల్లాలో పర్యటించింది. బత్తలపల్లి, ముదిగుబ్బ, కదిరి మండలాల్లో క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడి పంట నష్టం వివరాలను సేకరించింది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ చిన్మయ్ గోట్మారే నేతృత్వంలోని బృందం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌తో కలిసి పర్యటించింది. బత్తలపల్లి మండలంలోని కరువు ప్రభావిత గ్రామాలైన అప్పచెరువు, దంపెట్లలో బృందం పర్యటించింది. అప్పచెరువు గ్రామంలో రైతు అక్కిమ నాగమ్మ సాగు చేసిన ఆముదం పంటను పరిశీలించింది. వర్షపాతం లోటుతో పంట ఎదుగుదల ఏ మేరకు దెబ్బతింది, దిగుబడిపై ఎలాంటి ప్రభావం పడనుందనే వివరాలను అడిగి తెలుసుకుంది. దంపెట్ల గ్రామంలో రైతు నరసింహులు సాగు చేసిన ఉలవ పంటను కలెక్టర్‌తో కలిసి పరిశీలించింది. వేరుశనగ పంట వర్షాభావంతో దెబ్బతినడంతో ప్రత్యామ్నాయ పంటగా ఉలవ సాగు చేస్తున్నట్లు రైతు కేంద్ర బృందానికి వివరించారు. అనంతరం ముదిగుబ్బ మండలం గుంజేపల్లి గ్రామంలో రైతు నారాయణస్వామి సాగు చేసిన కంది పంటను బృందం పరిశీలించింది. పంట ఎదుగుదల, వర్షాభావ పరిస్థితుల ప్రభావం, జరిగిన నష్టం తీవ్రతను క్షేత్రస్థాయిలో అంచనా వేసింది. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి, ఇప్పటివరకు చేసిన ఖర్చులు, ప్రస్తుత పంట పరిస్థితి, ఆశించిన దిగుబడి, వర్షాలు లేక ఎదుర్కొంటున్న ఇబ్బందులపై రైతుతో ముఖాముఖి మాట్లాడి వివరాలు సేకరించింది. జిల్లాలో వర్షపాతం లోటు కారణంగా వేరుశనగ, కంది, మొక్కజొన్న, ఆముదం తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి కృష్ణయ్య కేంద్ర బృందానికి వివరించారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పంటల సాగు పరిస్థితులు, వ్యవసాయ రంగంపై కరువు ప్రభావాన్ని వివరించారు. కదిరి మండలం కాలసముద్రం గ్రామంలో నిర్వహించిన వీటీజీ రాంజీ పథకం గ్రామసభలో కేంద్ర బృందం పాల్గొంది. అనంతరం కదిరి పట్టణంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసి కరువు కారణంగా నష్టపోయిన పంటలకు సంబంధించిన ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించింది. వ్యవసాయ రంగంలో ఏర్పడిన నష్టాలు, పంటల దుస్థితిని ఫొటోల ద్వారా పరిశీలించింది. కేంద్ర బృందంలో జాయింట్ సెక్రటరీ చిన్మయ్ గోట్మారేతో పాటు మహాలనోబిస్ నేషనల్ క్రాప్ ఫోర్‌కాస్ట్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభా కాంతి, గ్రామీణాభివృద్ధి శాఖ అండర్ సెక్రటరీ వినోద్ సామంత్, కేంద్ర ఆర్థిక వ్యయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పంకజ్ పహాడియా, మానిటరింగ్ అండ్ అప్రైజల్ డైరెక్టరేట్ డైరెక్టర్ ఎన్.వి. సతీష్ సీమకుర్తి పాల్గొన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ రాష్ట్ర నోడల్ అధికారిగా వ్యవహరించారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి కృష్ణయ్య, ఉద్యానవన శాఖ అధికారి జయకుమార్, డీడబ్ల్యూఎంఏ పీడీ విజయ్ ప్రసాద్, పశుసంవర్ధక శాఖ, ఇతర జిల్లా, మండల అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.








జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల సిబ్బంది...

కేటాయింపు పూర్తి

పుట్టపర్తి, నవంబరు 03, అమరావతి వెలుగు : ఆంధ్రప్రదేశ్‌లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లాలో మూడో విడత రాండమైజేషన్ ప్రక్రియను మంగళవారం పూర్తి చేశారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పోలింగ్ పర్సనల్ ఆఫీసర్-2 (పీఓ-2) సిబ్బందికి పోలింగ్ స్టేషన్ల కేటాయింపు, మైక్రో అబ్జర్వర్ల నియామకానికి సంబంధించి కంప్యూటర్ ఆధారిత రాండమైజేషన్ నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఈ ప్రక్రియ చేపట్టారు. ఎన్నికల పరిశీలకుడు పి. అరుణ్ బాబు రాండమైజేషన్ ప్రక్రియను పర్యవేక్షిస్తూ ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా జరిగేలా సూచనలు చేశారు. జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సాఫ్ట్‌వేర్ ద్వారా నిర్వహించిన రాండమైజేషన్ ప్రక్రియను సమన్వయం చేస్తూ వివిధ పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది కేటాయింపులను పర్యవేక్షించారు. జిల్లా రెవెన్యూ అధికారి పి. కొండయ్య ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పరిపాలనా ఏర్పాట్లను సమీక్షించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది లభ్యత, ఇతర అవసరాలను పరిశీలించారు. ఎన్ఐసీ సిబ్బంది ఎం. రవికృష్ణ, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎస్. హరీష్ కుమార్ సాంకేతిక సహకారం అందించారు. కంప్యూటర్ ఆధారిత రాండమైజేషన్‌లో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఎన్నికల విధులకు సిబ్బంది, మైక్రో అబ్జర్వర్ల కేటాయింపులను పూర్తి పారదర్శకంగా చేపట్టామని, ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పక్షపాతానికి అవకాశం లేకుండా నిబంధనలను అనుసరించి ప్రక్రియ పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు.





Edited, Printed, Published & Owned by : JANAPATI VENKATA RAMESH BABU, #1-1189-21A, NGO Colony, KADIRI - 515591, Anantapuramu (Dist.), AP (State) and Printed at M/s AK PUBLICATIONS, #1-1189-2A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist), AP (State) and Published at #1-1189-21A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist.), (A.P), Editor : JANAPATI VENKATA RAMESH BABU, RNI No. APTEL / 2022 / 85169, E-mail : amaravathivelugu@gmail.com, Cell: 9440814576